క్లుప్తంగా

భీమవరం డివిజన్ ఖాజీగా ఫైజీ నియామకం



ఖాజీగా ఫైజీకి నియామక ప్రతం అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

సాక్షి, భీమవరం : భీమవరం డివిజన్ ఖాజీగా మొహమ్మద్ మొయిజి ఆలం ఫైజీ నియమితులయ్యారు. ఈమేరకు ఫైజీకి స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఉత్తర్వులు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ భీమవరం సున్ని జామియా మస్జిద్ ఫేస్ ఇమామ్ ఖాజీగా ఫైజీని ప్రభుత్వం నియమించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి ప్రజలకు సేవలందించి మంచి పేరు తెచ్చుకోవాలని ఫైజీకి సూచించారు. కార్యక్రమంలో ముస్లిం కమిటీ నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రత తప్పనిసరి



డాక్టర్ సుధను సత్కరిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం : విద్యార్థినులు వ్యక్తిగత శుభ్రత పాటిస్తూ రుతుక్రమ విషయాలు, పాలిసిస్టిక్ ఓవరి సిండ్రోమ్(పీసీఓఎస్)పై అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ ఆర్ సుధ అన్నారు. స్థానిక కేజీఆర్ఎల్ కళాశాలలో ఉమెన్ సెల్ ఆధ్వర్యంలో బుధవారం పీసీఓఎస్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కౌమార బాలికలు ఎక్కువగా పీసీఓఎస్‌తో ఎక్కువగా బాధపడుతుంటారని అయితే మందులతో సమస్యకు పరిష్కారముందన్నారు. అనంతరం డాక్టర్ సుధను సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి అలుగులమ్మ జాతర



చెరుకువాడలోని అలుగులమ్మ

ఉండి: చెరుకువాడ గ్రామదేవత అలుగులమ్మవారి 104 జాతర మహోత్సవాలను ఈ నెల 23న నుంచి మార్చి 2 వరకూ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. 23వ తేదీ ఉదయం కలశస్థాపన కార్యక్రమంతో ప్రారంభమయ్యే జాతర 2వ తేదీ ఊంజల్ సేవ కార్యక్రమాలతో ముగుస్తుందని తెలిపారు. అనంతరం 5వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటల నుంచి అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



వినతి పత్రం అందజేస్తున్న ఐద్వా నాయకులు

ఆకివీడు: స్థానిక ఏఎంసీ వద్ద బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన యువకుల్ని కఠినంగా శిక్షించాలని ఐద్వా సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం రెవెన్యూ కార్యాలయంలో డీటీ రాజ్ కిషోర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐద్వా నాయకులు సందక ఉదయకుమారి, డోకల లక్ష్మీ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు, మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాలైన గంజాయి, మద్యం విచ్చలవిడిగా అమ్ముతున్నారని వాపోయారు. డీఎస్పీ శ్రీనాథ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు డీ.పద్మ, జీవీ.లావణ్య, అచ్చాయమ్మ, షేక్‌పర్వీన్ పాల్గొన్నారు.

మూడు గ్రామాలకు కొత్త ఇన్‌చార్జి కార్యదర్శులు

తణుకు టౌన్: మండలంలోని దువ్వ, ముద్దాపురం, వేల్పూరు గ్రామాలకు ఇన్‌చార్జి కార్యదర్శులను కలెక్టర్ నియమించారు. ఈమేరకు బుదవారం ఆయా గ్రామ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. తణుకు మండలంలోని వేల్పూరు గ్రామ కార్యదర్శిగా వేల్పూరు 3 సచివాలయ కార్యదర్శి కేవీవీ రాజును, ముద్దాపురం గ్రామ కార్యదర్శిగా తేతలి 2 సచివాలయ కార్యదర్శి ఎం డాక్టర్ బాబును, దువ్వ గ్రామ కార్యదర్శిగా మండపాక 2 సచివాలయ కార్యదర్శి కె సూర్య మణికంఠలను నియమిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. అయితే ఈ గ్రామాలకు సంబంధించిన పారిశుద్ధ్య, జీతాల బిల్లుల, ట్రెజరీ వ్యవహారాలన్నీ గతంలో ఇన్‌చార్జి గ్రామ కార్యదర్శులుగా పని చేసిన గ్రేడ్ 1 కార్యదర్శుల పర్యవేక్షణలోనే జరుగుతాయని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అందరికీ ఆత్మీయుడు పాతపాటి సర్రాజు



క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి సర్రాజు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, మాజీ ఎమ్మెల్సీ చైతన్యరాజు

ఆకివీడు: అందరికీ ఆత్మీయుడైన పెద్దాయన పాతపాటి సర్రాజును కోల్పోవడం దురదుష్టకరమని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు సంతాపం వ్యక్తం చేశారు. భీమవరంలోని ఆదర్శనగర్‌లోని సర్రాజు నివాసంలో ఆయన కుటుంబ సభ్యుల్ని వాసుబాబు బుధవారం పరామర్శించారు. సర్రాజు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ ఆయన లేని లోటు పార్టీకి తీరనిదన్నారు. సర్రాజుకు శ్రద్ధాంజలి ఘటించి, వారి కుటుంబాన్ని పరామర్శించిన వారిలో నన్నయ్య యూనివర్సిటీ మాజీ వైస్‌ఛాన్సలర్ ఎం.ముత్యాల నాయుడు, మాజీ ఎమ్మెల్సీ చైతన్యరాజు, గాదిరాజు సుబ్బరాజు, డాక్టర్ విజయబాబు, రామరాజు ఉన్నారు.

సర్రాజుకు నివాళి అర్పించిన తెన్నేటి

కాళ్ల: ఇటీవలే గుండెపోటుకు గురై ఆకస్మికంగా మరణించిన క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పాతపాటి సర్రాజుకు మాదిగ రిజర్వేషన్ పోరాట సంఘర్షణ సమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు తెన్నేటి కిశోర్ బుధవారం నివాళులర్పించారు. శాఖ ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముసుకూడి రాము ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, సభ్యులు సర్రాజు సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ఎస్ రాష్ట్ర కార్యదర్శి తెన్నేటి సురేష్, నాయకులు బైపే విజయరాజు, ముసుకూడి సంసోను, ఉప్పాటి సత్యం, ముసుకూడి సురేష్, గరికిపూడి అశోక్, సిర్రా వరదరాజు పాల్గొన్నారు.

25న ఉండిలో సర్రాజు సంతాప సభ

ఉండి: ఇటీవలే గుండెపోటుతో హఠాత్తుగా మరణించిన క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పాతపాటి సర్రాజు సంతాప సభను ఈ నెల 25న శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఉండి వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు బుధవారం తెలిపారు. గణపవరం రోడ్డులోని ఏఎంసీలో నిర్వహించే ఈ కార్యక్రమానికి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, సర్రాజు అభిమానులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన కోరారు.

రహదారి పక్కనే పేరుకుపోతున్న చెత్త



భీమవరం - తణుకు రహదారిలో మోగల్లులో వద్ద రోడ్డు పక్కనే చెత్త డంప్ చేసిన దృశ్యం

పాలకోడేరు: ప్రభుత్వం పారిశుద్ధ్యంపై పదే పదే చెబుతున్నా, ఉన్నతాధికారులు ఆదేశాలిస్తున్నా పంచాయతీ అధికారులు, పాలక వర్గాలు పట్టించుకోవడం లేదు. పర్యవేక్షించాల్సిన మండలస్థాయి అధికారులు శ్రద్ధ తీసుకోవడం లేదు. ఫలితంగా మండలంలోని అనేక గ్రామాల్లో రహదార్ల పక్కన, కాలువ గట్ల వెంబడే చెత్తను వేయడంతో అవి డంపింగ్ యార్డులుగా దర్శనమిస్తున్నాయి. దీంతో తాగునీటి చెరువులకు వినియోగించే కాలువ నీరు కలుషితమవుతోంది. మోగల్లు గ్రామంలో చెత్తను స్థానిక పెన్నేరమ్మ గుడి వద్ద వేస్తున్నారు. గోస్తనీ డ్రెయిన్ గట్టునే చెత్త వేసి డంపింగ్ యార్డుగా మారుస్తున్నారు. గ్రామాల్లో డంపింగ్ యార్డులకు అనువైన ఖాళీ స్థలాలు ఉన్నాయా లేవా అనేది ఇంతవరకు మండలస్థాయి అధికారులు వద్ద నివేదిక లేదంటే అతిశయోక్తి కాదు. మేజర్ పంచాయతీ శృంగవృక్షం గ్రామంలో చెత్త ఎక్కడికక్కడ పేరుకుపోతోంది. డంపింగ్ యార్డులకు ఖాళీ స్థలం లేదని పంచాయతీ అధికారులు చెబుతున్నారు. ఖాళీ స్థలం ఆక్రమణలో ఉందని దాన్ని అధికారులు స్వాధీనం చేసుకోవాలని గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు సర్వే నంబర్‌తో సహా అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా స్పందించలేదు. దీనిపై త్వరలో హైకోర్టుకు ఆశ్రయించడం తప్ప వేరే దారి లేదని గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గులిపల్లి సత్యనారాయణ స్పష్టం చేశారు.

పేరంటాలమ్మ జాతరకు భారీ ఏర్పాట్లు



వెలివర్రులో జాతర ఏర్పాట్లపై చర్చిస్తున్న కమిటీ సభ్యులు

ఉండి: ప్రసిద్ధిగాంచిన ఉండి మండలం వెలివర్రు వీర పేరంటాలమ్మ వారి జాతర మహోత్సవాల నిర్వహణకు భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మంతెన రంగరాజు తెలిపారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో మేనేజర్ ఆర్‌పీఆర్ కిశోర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్మకర్తల మండలి సమావేశంలో జాతర ఏర్పాట్లు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణపై సమీక్షించారు. ముందుగా ధర్మకర్తల మండలి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసారు. అనంతరం జాతర, ఈ సందర్భంగా చైర్మన్ రంగరాజు మాట్లాడుతూ మార్చి 22వ తేదీ ఉగాది పర్వదినం నుంచి 31వ తేదీ శ్రీరామనవమి వరకు ఉత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ ఉత్సవాల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన వివిధ జిల్లాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు వస్తారని, అందుకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆలయ మేనేజర్ కిశోర్, మాజీ చైర్మన్ కోళ్ళపల్లి సతీష్‌రాజు మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం ఆలయ ప్రాంగణంలో దాతల సహకారంతో భారీ షెడ్లు, చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఉపసర్పంచ్ ముదునూరి కొండరాజు, మాజీ సర్పంచ్ ఎస్ దుర్గారావు, వార్డు సభ్యుడు రుద్రరాజు నాగసంజీవరాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న హౌసింగ్ ఏఈ శశికుమార్

భీమవరం అర్బన్ : జగనన్న లే అవుట్‌లలో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన చేపట్టాలని హౌసింగ్ ఏఈ శశికుమార్ అన్నారు. మండలంలోని యనమదుర్రు గ్రామంలో ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు, తాపీ మేస్త్రీలకు బుధవారం ఇళ్ల నిర్మాణాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హౌసింగ్ ఏఈ శశికుమార్ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలకు వాతావరణం అనుకూలంగా ఉందని, ప్రభుత్వం లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునే విధంగా ప్రోత్సహిస్తోందన్నారు. ప్రభుత్వం నుంచి రూ.లక్షా 80 వేలు మంజూరుకాగా బేస్‌మెంట్ వరకు 40 బస్తాలు సిమెంట్, రెండున్నర యూనిట్లు ఇసుక, 342 కేజీల స్టీల్ ఇస్తున్నామన్నారు. అదనంగా డ్వాక్రా గ్రూపు ద్వారా బ్యాంకు నుంచి రూ.35 వేల రుణం మంజూరు చేయడం జరుగుతుందన్నారు. గ్రామంలో జగనన్న లే అవుట్‌లలో 86 మంది లబ్ధిదారులు ఉండగా 8 మంది లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకుంటున్నారని మిగిలిన వారు వెంటనే ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ బూరబత్తుల రామ్మూర్తి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సమన్వయంతో కృషి చేయాలి



వేండ్రలో ఎంపీపీ చంటిరాజుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాస్

పాలకోడేరు: పాలకోడేరు మండల పరిషత్ అధ్యక్షుడు భూపతిరాజు చంటిరాజు పుట్టిన రోజు సందర్భంగా ఎమ్మెల్సీ అభ్యర్థి, జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ మండలంలోని పలువురు బుధవారం ఆయన స్వగృహంలో కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, అభిమానులు ఉద్యోగులు, అధికారులు ఉన్నారు. ఈ సందర్భంగా కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ సమన్వయంగా మండలం మరింత అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చంటి రాజు హామీ ఇచ్చారు. జిల్లా పరిషత్ చైర్మన్, ఎమ్మెల్సీ అభ్యర్థి కవురు శ్రీనివాస్ ఎంపీపీ చంటిరాజును కలిసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సోడదాసి నరేష్, ఆదాడ లక్ష్మి తులసీ, జేసీఎస్ మండల కన్వీనర్ పాలా రాధాకృష్ణ, సర్పంచ్‌లు కడలి నాగేశ్వరి, చింతపల్లి వెంకటనారాయణ, భూపతిరాజు వంశీకృష్ణంరాజు, బొల్లా శ్రీనివాస్ జంగం సూరిబాబు, గొట్టుముక్కల శివాజీ రాజు, కడలి లక్ష్మి, బొల్లా శ్రీనివాస్ ఇంజేటి మరియమ్మ, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యురాలు డాక్టర్ డీఆర్ స్వర్ణలత, భూపతిరాజు సుబ్బరాజు పాల్గొన్నారు.

గోదావరి రేవులో వసతుల లేమి



బురదతో అధ్వానంగా ఉన్న నరసాపురం వశిష్టా గోదావరి రేవు

నరసాపురం: నిత్యం రద్దీగా ఉండే వశిష్టాగోదావరి వలందర్ రేవులో కనీస వసతులు లేక అక్కడికి వచ్చే భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మునిసిపల్ అధికారులు ఈ విషయంలో దృష్టి పెట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. పట్టణంలో గోదావరి వలందర్ రేవు ప్రధానమైంది. కర్మకాండలు, పూజలు నిమిత్తం దూరప్రాంతాల నుంచి నిత్యం రేవుకు అనేక మంది వస్తుంటారు. ప్రతీరోజూ వందల సంఖ్యలో భక్తులు రేవులో స్నానాలు చేస్తారు. కానీ రేవులో కనీస వసతులు మాత్రం లేవు. ముఖ్యంగా రేవును శుభ్రం చేయడం లేదు. దీంతో రేవు నిండా బురద పేరుకు పోతుంది. దీంతో స్నానాలకు దిగిన భక్తులు రేవులో కాళ్ళు జారి పడుతున్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదాలకు గురి కావాల్సి వస్తోందోనని భక్తులు భయాందోళనలు చెందుతున్నారు. రేవులో అస్తికలు కలిపిన కుండలు వంటివి ఎప్పటికప్పుడు తీయకపోవడం కూడా ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. రేవులో 6 అడుగులు దూరం దాటి వెళితే చాలా లోతు ఉంటుంది. సముద్రపు పోటు స్థానికంగా రేవులో నీరు ఎక్కువగా ఉంటుంది. పోటు సమయంలో రేవులో నీరు లేక పోతే అక్కడి అధ్వాన పరిస్థితులు పైకి పూర్తిగా కన్పిస్తాయి. ముఖ్యంగా రేవులో తాగునీటికి సంబంధించి ఓ మంచినీటి కుళాయిని ఏర్పాటు చేయాలని ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నారు.

చిప్ ప్రాధాన్యతను ఇంజినీర్లు గుర్తించాలి



ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో ప్రభాకరరావును సత్కరిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం : ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ప్రపంచంలో ఎలక్ట్రానిక్స్ పరిశ్రమకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ప్రధానమైన మైక్రో చిప్స్ ఉక్రెయిన్ నుంచే సరఫరా అవుతున్నాయని బెంగుళూరు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ విజిటింగ్ సైంటిస్ట్ సెంటర్ ఫర్ నానో సైన్స్ అండ్ ఇంజనీరింగ్ డాక్టర్ వైపీ ప్రభాకర్‌రావు అన్నారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం నూతన సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులకు నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. ప్రపంచమంతా మైక్రోచిప్స్ తయారీపై దృష్టి పెట్టిందని దీనిలో భాగంగానే ఇప్పటికే యూఎస్ ఈ రంగంలో బిలియన్ డాలర్లు ఖర్చుపెడుతుండగా మనదేశం ఉత్పత్తి రంగంలో పలు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు చెప్పారు. దేశంలో ప్రధానమైన ఐఐటీలు దీనిపై లోతైన పరిశోధనలు చేస్తున్నాయన్నారు. వేగంగా మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంలో ప్రతి ఒక్కరూ నైపుణ్యం సంపాదిస్తూ ఉత్పత్తి రంగంలో బాసటగా నిలవాలని ప్రభాకరరావు చెప్పారు. ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలో ప్రధానమైన చిప్ కారణంగా ఎలక్ట్రానిక్స్ పరిశ్రమ కష్టాలు ఎదుర్కొంటుందంటే చిప్ ప్రాధాన్యతను ప్రతి ఇంజనీరు గుర్తించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.జగపతిరాజు మాట్లాడుతూ టెక్నాలజీ రంగంలో ఎంతో వేగంగా అభివృద్ధి చెందుతుందని నూతన విద్యా విధానంలో పుస్తకాలకు పరిమితం కాకుండా ప్రపంచంలో నూతన సాంకేతికతపై అధ్యయనం చేస్తేనే విద్యార్థులకు భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరం డాక్టర్ ప్రభాకర్‌రావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఈసీఈ హెడ్ డాక్టర్ ఎస్.ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మాలమహానాడు ఇన్‌చార్జిగా సువర్ణరాజు



జిల్లా మాలమహానాడు ఇన్‌చార్జిగా నేతల సువర్ణరాజుకు నియామకపత్రం అందజేస్తున్నదృశ్యం

సాక్షి, భీమవరం : అంబేడ్కర్ ఆశయాలు ముందుకు తీసుకెళ్లే విధంగా ప్రభుత్వాలు కృషి చేయాలని, 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు ప్రభుత్వం చేస్తున్న కృషి ప్రశంసనీయమని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ అన్నారు. భీమవరంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా మాలమహానాడు ఇన్‌చార్జిగా నేతల సువర్ణరాజును నియమిస్తూ నియామకపత్రం అందచేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సంధి జయరాజు, జిల్లా కార్యదర్శి కోలాట ప్రసాదరావు, పిట్టా వినోద్ కుమార్, గొర్ల గోపి, దాసరి చిరంజీవి, నన్నేటి నాగరాజు, నేతల సాల్మన్‌రాజు, పెనుమాల చందుబాబు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఉపాధి హామీ పనులు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

పాలకోడేరు: మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మోగల్లు, శృంగవృక్షం, కోరుకొల్లు, వేండ్ర, పెన్నాడ, విస్సాకోడేరుపే, గొరగనమూడి, మైప, గరగపర్రు, గొల్లల కోడేరు, కుముదవల్లి, పాలకోడేరు తదితర గ్రామాల్లో ఉపాధి పనులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా టెక్నికల్ అసిస్టెంట్ పిల్లి చిట్టి జయబాబు మాట్లాడుతూ 1.69 లక్షల పనిదినాలకు ఇప్పటి వరకు 1,44,659 పనిదినాలు కల్పించామన్నారు. మండలంలో 8,763 మందికి జాబ్ కార్డులున్నాయని వీరిలో 4,945 మందికి పనులు కల్పించామన్నారు. అమృత్ సరోవర్ పథకంలో మంజూరైన శృంగవృక్షంలోని రెండు చెరువు వద్ద పనులు చురుకుగా సాగుతున్నాయని అన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో మత్స్యకారులకు ప్రాధాన్యం

నరసాపురం రూరల్: రాష్ట్రంలో జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్థానిక సంస్థలు, ఎమ్మెల్యే, గవర్నర్ కోటాలో వైఎస్సార్ సీపీ ఎంపిక చేసిన అభ్యర్థుల్లో ప్రాధాన్యతను ఇచ్చారని జాతీయ మత్స్యకారుల సంఘం జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు బొడ్డు ఆశిష్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. వెనుకబడిన కులాలను ఓటు బ్యాంకుగా కాకుండా వెన్నెముకగా భావించే ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ వెల్లడించారు. బీసీలకు కేటాయించిన ఎమ్మెల్సీల్లో అధిక శాతం మత్స్యకారులు ఉన్నారని పేర్కొన్నారు. మత్స్యకారుడైన మోపిదేవి వెంకటరమణను మొట్టమొదట రాజ్యసభకు పంపిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కే దక్కుతుందని వివరించారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డికి తిరిగి పట్టం కట్టేందుకు ఆంధ్ర రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆశిష్‌కుమార్ పేర్కొన్నారు.

ఉయ్యాలవాడకు ఘన నివాళి



ఉయ్యాలవాడకు నివాళులు అర్పిస్తున్న డాక్టర్ చారుమతి

పెనుమంట్ర: మండలంలోని మార్టేరులోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో ప్రథమ స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి సభను బుధవారం నిర్వహించారు. మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఇన్‌ఛార్జ్ ఏడీఆర్ డాక్టర్ ఎం చారుమతి అధ్యక్షతన నిర్వహిచిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థులు నరసింహారెడ్డి జీవితచరిత్రను ఆయన పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. ముందుగా నరసింహారెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మార్టేరు వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు నరసింహారెడ్డి జీవిత విశేషాలు గురించి తెలిపారు.

సెల్ టవర్ ఎక్కి వ్యక్తి హల్‌చల్

సాక్షి, భీమవరం: తనపై దాడి చేసిన వారిని శిక్షించాలంటూ పట్టణంలోని బుధవారం మార్కెట్‌సెంటర్‌లో సెల్ టవర్‌పైకి ఎక్కి ఓ వ్యక్తి బుధవారం హల్‌చల్ చేశాడు. పట్టణానికి చెందిన బి.వసంతరావు తనను ముగ్గురు వ్యక్తులు కొట్టారంటూ సెల్ టవర్ ఎక్కాడు. స్థానికుల సమాచారం అందించడంతో పోలీసు, అగ్నిమాపక అధికారులు టవర్ వద్దకు చేరుకున్నారు. విద్యుత్ శాఖాధికారులు అప్రమత్తమై విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దాడి చేసిన వారిని శిక్షిస్తామని అధికారులు చెప్పడంతో టవర్ నుంచి కిందకి దిగి వచ్చాడు.

గ్రహణం మొర్రికి ఉచిత శస్త్ర చికిత్సలు

సాక్షి, భీమవరం : గ్రహణం మొర్రి ఉన్న వారికి హైదరాబాద్ బసవతారకం ఇండో అమెరికన్ ఆసుపత్రి వైద్యుల సహకారంతో ఉచితంగా శస్త్ర చిక్తిత్సలు అందించనున్నట్లు సమగ్ర శిక్ష ఏపీసీ శ్యాం సుందర్ బుధవారం తెలిపారు. భీమవరంలోని ఏఆర్‌కేఆర్ మున్సిపల్ పాఠశాల ఆవరణలో మార్చి 1వ తేదిన వైద్య శిబిరం నిర్వహిస్తామని, 6 నెలల నుంచి 50 ఏళ్ల వయస్సు ఉన్న వారు హాజరు కావచ్చన్నారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి రవాణా, సదుపాయాలు కల్పిస్తారని పేర్కొన్నారు.

శ్రీశ్రీతో తెలుగు కవిత్వం కొత్త పుంతలు

నరసాపురం: మహాకవి శ్రీశ్రీ తెలుగు కవిత్వాన్ని కొత్త పుంతలు తొక్కించారని డాక్టర్ కడిమిళ్ల వరప్రసాద్ గురు సహస్రావధాని అన్నారు. అల్లూరి సాంస్కృతిక కేంద్రం, భగత్‌సింగ్ విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో నిర్వహించిన రెడ్‌బుక్ డే వేడుకలో ఆయన మాట్లాడారు. మహా ప్రస్థానంలో శ్రీశ్రీ సామ్యవాదాన్ని వినిపించారని చెప్పారు. తాజ్‌మహల్ నిర్మాణానికి రాళ్లు ఎత్తిన కూలీలు ఎవ్వరు? అని ప్రశ్నించడానికి ఎంతో ధైర్యం కావాలన్నారు.

సాగునీటి ఎద్దడిని అరికట్టాలి

సాక్షి, భీమవరం : దాళ్వాలో సాగునీరందక వరినాట్లు ఎండిపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై ప్రభుత్వ యంత్రాంగం తక్షణం దృష్టిపెటాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. డెల్టా ప్రాంతంలోని కాళ్ళ, వీరవాసరం, పోడూరు, పెనుగొండ తదితర మండలాల కాలువ శివారు భూములకు సాగునీరు అందక బీటలు తీశాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సాగునీటి సలహా మండలి సమావేశంలో అధికారులు దాళ్వాసాగుకు అవసరమైన నీటిని పుష్కలంగా సరఫరా చేస్తామన్నారని, అయితే ప్రస్తుతం చేలకు నీరు అందకపోవడంపై పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సాగునీటి ఎద్దడిని తక్షణం పరిష్కరించాలని కోరారు.

దిరుసుమర్రులో అన్నసమారాధన

భీమవరం అర్బన్ : మండలంలోని దిరుసుమర్రు గ్రామంలో కొలువైయున్న స్వయంభూ గంగా భ్రమరాంభ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆఖరిరోజు బుధవారం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. ముందుగా రామలింగేశ్వర స్వామివారికి పంచామృత అభిషేకాలు, గోక్షీరాభిషేకం, సహస్రనామార్చనలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ వంటకాలతో సుమారు 6 వేల మందికి అన్నసమారాధన చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ అల్లూరి బంగార్రాజు, సభ్యులు కలిదిండి పేర్రాజు, మైగాపుల గంగారామ్, కె.సూర్యనారాయణరాజు, యాళ్ళ బాబులు, గవరపు రాజబాబు, త్రిమూర్తులు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైభవంగా అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠ



దుర్గ భవాని దేవి విగ్రహ పునఃప్రతిష్ఠ పూజల్లో పాల్గొన్న భక్తులు

ఆకివీడు: స్థానిక జానకీనగర్‌లోని విజయ దుర్గభవాని దేవి దేవస్థానంలో వేద మంత్రాలతో అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమం బుధవారం వైభవంగా నిర్వహించారు. పూర్ణాహుతి హోమం, పూర్ణకుంభం, మహా నైవేద్యం సమర్పించారు. అనంతరం తులసి కోట, త్రిశూలం ప్రతిష్ఠించారు. మహిళలు కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ విగ్రహ దాత అడ్వకేట్ పువ్వాడ రాజా అమర్‌నాథ్, త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ, వర సిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ప్రతినిధులు గొర్లె రామారావు, గంటా ఈశ్వరరావు, బైరి లక్ష్మీనారాయణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భీమవరంలో మానవత ఏర్పాటుకు సన్నాహాలు



సమావేశంలో మాట్లాడుతున్న జానకీరామరాజు

సాక్షి, భీమవరం : పట్టణంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఏర్పాటుకు సన్నాహక సమావేశం త్యాగరాజు భవనంలో నిర్వహించారు. సంస్థ విస్తరణాభివృద్ధి కమిటీ రాష్ట్ర కన్వీనర్ సాగిరాజు జానకిరామరాజు, సంస్థ జిల్లా అధ్యక్షుడు రామిశెట్టి గంగాధరరావు మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో అనేకచోట్ల రక్తదాన శిబిరాలు, పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటడం, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అదేవిధంగా భీమవరంలో కూడా కార్యకలాపాలు చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా సుంకర మునలయ్య రూ.70 వేలు విలువచేసే ఫ్రీజర్‌ను సంస్థకు బహుకరిస్తున్నట్లు ప్రకటించారు.